క్లుప్తంగా

30న చిరుధాన్యాల దినోత్సవ సదస్సు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద చిరుధాన్యాల దినోత్సవ సదస్సు సోమవారం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ రాజాం అధికారి ఎ.రేణుకాసాయి ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

దాడితల్లి పండగకు సన్నాహాలు

బొబ్బిలి: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో దాడితల్లి పండగ నిర్వహణకు గ్రామస్తులు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే విషయమై ఆదివారం సమావేశమైన గ్రామపెద్దలు మే 1వ తేదీ నుంచి దాదాపు 3 రోజుల పాటు అమ్మవారి పండగ నిర్వహణకు తీర్మానం చేశారు.

నేడు నాయరాళ్లవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని నాయరాళ్లవలస గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలంతా హాజరు కావాలని ఆయన కోరారు.

రూ.2 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం


గోరు వీధిలో వేసిన సీసీ రోడ్డు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామ గోరు వీధిలో రూ.2 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దాదాపు 300 మీటర్ల పొడవునా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మించినట్లు పీఆర్‌జేఈ ప్రభాకరరావు తెలిపారు. రోడ్డు నిర్మాణం జరగడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ, వైఎస్సార్ సీపీ నేత గెడ్డాపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు


మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: నదీ పరీవాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన సంకిలి, కందిశ, తునివాడ, కె.వెంకటాపురం ప్రాంతాల్లో సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేయడంతో ఇసుక అక్రమ రవాణా ఆగిందన్నారు. అనుమతి ఉన్న ప్రాంతాల నుంచి మాత్రమే ఇసుకను తరలించాలని ఎస్‌ఐ సూచించారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి


చాటాయవలసలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులంతా పంటకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయవలస, వన్నలి, అక్కన్న అగ్రహారం, ఉప్పరనాయుడువలస గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే రైతులు పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు వీలుంటుందన్నారు.

వచ్చే నెల 1న దుర్గాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న దుర్గాలమ్మ ఆలయం

డెంకాడ: మండలంలోని కొండరాజుపేటలో నూతనంగా నిర్మించిన దుర్గాలమ్మ ఆలయాన్ని ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రారంభించనున్నట్లు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సరగడ బంగారురెడ్డి, ఆయన సతీమణి గ్రామ సర్పంచ్ కల్యాణి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ, తమ సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించామని, ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, తదితరులు హాజరవుతారన్నారు.


రాజాం: కంచరాంలో నిర్మాణ దశలో జగనన్న కాలనీ ఇళ్లు

శరవేగంగా గృహ నిర్మాణాలు

- జగనన్న కాలనీల్లో జోరందుకున్న ఇళ్ల నిర్మాణాలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో నిర్మాణానికి లబ్ధిదారుల చొరవ
- ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు సన్నాహాలు


రామభద్రపురం జగనన్న కాలనీలో తుది దశకు చేరిన ఇళ్ల నిర్మాణాలు

రామభద్రపురం: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. నిర్మాణాలు దాదాపు పూర్తి కావస్తుండడంతో లబ్ధిదారులంతా తమ సొంతింటి కల నెరవేరుతుందన్న సంతృప్తి వ్యక్తం చేస్తుండడం విశేషం. ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంతో ఇప్పుడు అంతటా నిర్మాణాలు చకచకా జరుగుతున్నాయి. నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేయడంతో పాటు తక్కువ ధరకే సిమెంట్ అందిస్తోంది. ఆర్థిక స్తోమత తక్కువగా ఉన్న లబ్ధిదారులంతా డ్వాక్రా సంఘంలో సభ్యులుగా ఉంటే వారికి తక్కువ వడ్డీకే స్త్రీనిధి రుణాలు కూడా ఇప్పిస్తోంది. దీంతో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులు చొరవ చూపిస్తున్నారు. ప్రభుత్వం కూడా జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తోంది. అధికారులు కూడా నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచిస్తుండడంతో ఇప్పుడు ఎక్కడ చూసినా దాదాపు పూర్తి కావచ్చిన నిర్మాణాలే కనిపిస్తుండడం గమనార్హం.

రాజాం: పట్టణ పరిధిలోని కంచరాం సమీపంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడ దాదాపు 1200 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో వారంతా ఇప్పుడు ఇళ్ల నిర్మాణంలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వాతావరణం కూడా ఇళ్ల నిర్మాణానికి అనువుగా ఉండడంతో లబ్ధిదారులంతా నిర్మాణాలను వేగవంతం చేసినట్లు ఏఈ రాజగోపాలరావు తెలిపారు.

గిరిజన రైతాంగ పోరాట చరిత్రే భూషణం కథలు

- ప్రముఖ సాహితీవేత్త పొదిలాపు శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సాహితీవేత్త శ్రీనివాసరావు

రాజాం సిటీ: పార్వతీపురం గిరిజన ప్రాంతాల్లో గత శతాబ్దంలో జరిగిన రైతాంగ పోరాట చరిత్రనే భూషణం మాష్టారు నవలలు, కథలుగా మలిచారని ప్రముఖ సాహితీవేత్త పొదిలాపు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో జరిగిన రాజాం రచయితల వేదిక సమావేశానికి ముఖ్యవక్తగా హాజరైన ఆయన 'భూషణం కథలు' అనే అంశంపై కాసేపు ప్రసంగించారు. చారిత్రకమైన శ్రీకాకుళ గిరిజన పోరాటాన్ని, అక్కడి గిరిజనుల జీవన విధానాన్ని అక్షరబద్ధం చేసిన ప్రముఖ రచయిత భూషణం అని ప్రశంసించారు. భూషణం ఉద్ధరింపు, పులుసు వంటి పదుల కొద్ది కథలను, కొండగాలి, అడవంటుకుంది వంటి నవలలను రాసి, కథా సాహిత్యంలో ఉన్నత స్థానంలో నిలిచారన్నారు. కంబారి వ్యవస్థను కంబారుల తరఫున చిత్రించిన ఏకైక వ్యక్తి భూషణం అని అన్నారు ఆయన రచనలన్నీ పోరాటాన్ని, తిరుగుబాటును ప్రోత్సహిస్తాయన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను రచయితల వేదిక సభ్యులు సత్కరించారు. సమావేశంలో మూడడ్ల శ్రీనివాసరావు, రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, సభ్యులు రౌతు గణపతిరావునాయుడు, పిల్లా తిరుపతిరావు, పొట్నూరు కోటిబాబు, ఒమ్మి రమణమూర్తి, పెంకి దయానిధినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మజ్జిగౌరమ్మ విగ్రహ ప్రతిష్ట


మజ్జిగౌరమ్మకు పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్తలు

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మజ్జిగౌరమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు పులఖండం శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో మజ్జిగౌరమ్మ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి, తొలిపూజలు గ్రామస్తులతో చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, సచివాలయాల మండల కన్వీనర్ రాగోలు రమేష్ నాయుడు, రాయఘడ, పార్వతీపురం ప్రాంతాల వేదపండితులు రేజేటి శ్రీనివాసశర్మ, వేమకోటి నాగభూషణశర్మ, వేమకోటి సతీష్‌శర్మ, బూరాడ ప్రవీణశర్మ, పులఖండం శ్రీకాంత్ శర్మ, ఆలయ ధర్మకర్తలు వావిలపల్లి సందీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ పరీక్షకు 195 మంది హాజరు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ(నేషనల్ క్యాడెట్ కార్ప్స్) 'ఎ' సర్టిఫికెట్ పరీక్షకు 195 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ బీవీ అచ్యుత్‌కుమార్ తెలిపారు. రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సన్ స్కూల్, శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలురు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలికలు), కొల్లివలసలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల, పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులు హాజరయ్యారని, అయితే ఇద్దరు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. వీరందరికీ రాత పరీక్షతో పాటు డ్రిల్ పరీక్ష కూడా నిర్వహించారు. సుబేదార్ ఆర్.నానాజి, నాయక్ సుబేదార్ భూపేంద్రసింగ్, ఎన్‌సీసీ ఆఫీసర్లు డి.ఉదయ్, కె.హరికృష్ణ, వెంకటరమణల పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి.

ఎవరెన్ని యాత్రలు చేసినా వైఎస్సార్ సీపీదే విజయం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: అధికార దాహం తీర్చుకునేందుకు ఎవరెన్ని పాదయాత్రలు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం ఖాయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రశంసించారు. మండలంలోని వండానపేట గ్రామంలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుమారుడు లోకేష్ పాదయాత్ర చేస్తున్నప్పటికీ ఆ పార్టీకి ప్రజల్లో అంతగా స్పందన లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో చేసిన పాదయాత్ర, ప్రజా సంకల్పయాత్రకు మంచి స్పందన వచ్చిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీని ఈ మూడున్నరేళ్లలో ఆయన అమలు చేశారని తెలిపారు. ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి నేరుగా సంక్షేమ పథకాలు అందడంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోకి వెళ్లేటప్పుడు ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని, మళ్లీ ఆయననే ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు తహతహలాడుతున్నారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్ మోహనరావు, సర్పంచ్‌లు వియ్యపు చక్రపాణి, కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం గోవిందరావు, గార రమణ, కరణం శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాగిరి అప్పలనాయుడు, పిల్లా గౌరినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పాఠశాల స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కథలు, ఇతిహాస గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలను చదివించారు. అనంతరం వారికి క్విజ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఆదివారం గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందిస్తోందన్నారు. చిన్నతనం నుంచే పుస్తకాలు బాగా చదువుకుంటే విజ్ఞానవంతులవుతారన్నారు. ప్రతీ విద్యార్థి చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని ఆయన కోరారు.

కారాడలో 'పొలంబడి'


పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకురాలు మూడడ్ల సంతోషి పంటలకు సోకే తెగుళ్లు, చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, పురుగుమందు పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

జనసేన ర్యాలీ

డెంకాడ: జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన నెల్లిమర్ల నియోజక వర్గ నాయకురాలు లోకం నాగమాధవి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

టెస్ట్ పేపర్ల పంపిణీ


టెస్ట్ పేపర్లతో విద్యార్థులు, యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా సభ్యుడు ఎం.శశిభూషణరావు కోరారు. స్పందన స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ రాజావేణుగోపాలరావు సౌజన్యంతో యూటీఎఫ్ సంఘ సభ్యులు ముద్రించిన పదో తరగతి టెస్ట్ పేపర్లను మండలంలోని మెట్టవలస ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు విజయగౌరి, ప్రసన్నకుమార్, కేశవరావు, రమేష్, కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రయోజనాలను అడ్డుకోవద్దు..

- ఏపీజీఈఏ డిమాండ్


మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు

విజయనగరం అర్బన్: ఉద్యోగికి ఆర్థికంగా రావాల్సిన ప్రయోజనాలను అడ్డుకోవద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక డ్రైవర్ల అసోషియేషన్ భవనంలో జరిగిన వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంలో పలువురు మాట్లాడుతూ, రెండేళ్లుగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆర్థిక ప్రయోజనాలను కల్పించాలని కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ తీర్మానం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారావు విధిలేని పరిస్థితిలో రాష్ట్ర గవర్నర్ హరిచందన్ విశ్వభూషణ్‌ను కలవాల్సి వచ్చిందని తెలిపారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ, వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు వి.శ్రీనివాసరావు, బియ్యాల చంద్రశేఖర్, మరడ సింహాచలం, పువ్వల శ్రీనివాసరావు, పి.భూషణరావు, ఎల్‌వీ యుగంధర్, సీహెచ్ వెంకటసతీష్, వై.శంకరరావు, రామచంద్రపాండా, కె.శంకరరావు, వీవీ సుబ్రహ్మణ్యం, ఎస్.సూర్యనారాయణ, బి.శంకరరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రాజ్యాధికారమే లక్ష్యం


విశ్వనాథ్‌ను అభినందిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: దళిత బహుజనలకు రాజ్యాధికారం అందించడమే మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అణగారిన ప్రజల విముక్తి కోసం ఎంఎస్‌పీ పని చేస్తోందన్నారు. పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టామన్నారు. ఆధిపత్య కులాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల హక్కులకు పోరాడిన ఏకైక పార్టీ తమదేనన్నారు. భవిష్యత్‌లో దళిత, బహుజన, ముస్లిం మైనార్టీ ప్రజలందరిని కలుపుకొని ప్రధాన సమస్యలపై పోరాడతామన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ. నరేష్ తెలిపారు. చింతపల్లి బర్రిపేటకు చెందిన విద్యార్థిని ఈ నెల 28న ఉదయం 8 గంటలకు పాఠశాలకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరింది. సాయంత్రమైనా విద్యార్థిని ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు సమీప గ్రా మాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం


బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రేగిడి: వైఎస్సార్ బీమా పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పెద్దశిర్లాం గ్రామానికి చెందిన సంచాన విష్ణుమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన భార్య అప్పలనారాయణకు వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల తక్షణ సాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, సర్పంచ్ లెంక రాంబాబు, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, మండల సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల అబ్జర్వర్ పాలవలస రామచంద్రినాయుడు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో 'నారాయణపురం'

- రూ. 2.5 కోట్లతో అభివృద్ధి పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




రూ. 25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

విజయనగరం రూరల్: 'అభివృద్ధి.. సంక్షేమం' రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్నారు. అంతేకాకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు మంజూరు చేయడమే కాకుండా గ్రామాలకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

రూ. 2.5 కోట్లు మంజూరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో గ్రామానికి ఇప్పటివరకు అభివృద్ధి పనులకు రూ. 2.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందులో కోటి రూపాయలతో జిల్లా కేంద్రం నుంచి గ్రావెల్ రోడ్డు నిర్మించారు. మరో రూ. కోటితో గ్రామ సచివాలయ భవనం, విలేజ్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం, పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతోపాటు గ్రామంలో మరో మూడు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో గ్రామంలో అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా పూర్తి చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రైతుభరోసా కేంద్ర భవనం


నిర్మాణం పూర్తయిన వెల్‌నెస్ సెంటర్ భవనం


సుందరంగా తీర్చిదిద్దిన ఎస్‌డబ్ల్యూపీ కేంద్రం

అభివృద్ధి దిశగా నడిపిస్తాం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చారు. అవినీతికి తావులేకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. దీంతోపాటు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారు. మూడున్నరేళ్లలో గ్రామాభివృద్ధికి రూ. 2 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయడంతో సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం, జల్ జీవన్ మిషన్ పనులు, విలేజ్ క్లినిక్ భవనం, సీసీ రోడ్లు నిర్మించుకున్నాం. అలాగే జిల్లా కేంద్రం నుంచి ఎస్వీఎన్ నగర్ మీదుగా గ్రామానికి రహదారి వేసుకున్నాం. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నాం.

– వై.పైడిరాజు, సర్పంచ్, నారాయణపురం